ఇక్కడ గ్రావెల్..



మన్నారుపోలూరులోని ఓ వెంచర్‌లో గ్రావెల్‌ను అన్‌లోడ్ చేస్తున్న టిప్పరు

చీకటి పడితే చాలు.. ఆ వెంటనే ఎక్స్‌కవేటర్ల రొద మొదలవుతుంది. ప్రభుత్వ భూమిని చీల్చి గ్రావెల్‌ను తవ్వుతాయి. టిప్పర్లు రయ్‌మంటూ పరుగులు తీస్తాయి. ఇలా పూలతోటమిట్టలో మొదలయ్యే గ్రావెల్ అక్రమ రవాణా సూళ్లూరుపేట, తడ ప్రాంతాలకు సాగుతోంది. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

చీకటి పడితే చకచకా

● పూలతోటమిట్ట నుంచి సూళ్లూరుపేటకు యథేచ్ఛగా అక్రమ రవాణా

సూళ్లూరుపేట డివిజన్‌లో గ్రావెల్ దోపిడీ ఆగడం లేదు. గ్రావెల్ అక్రమ రవాణాతో మాఫియా మళ్లీ చెలరేగిపోతోంది. కొంతకాలం స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు అందిన కాడికి దోచుకుంటున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా గ్రావెల్‌ను అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. సీజేఎస్ఎఫ్, అసైన్డ్ భూముల్లో ఎక్స్‌కవేటర్లతో సాయంతో రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్‌ను తవ్వి టిప్పర్లలో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి సూళ్లూరుపేట, ఇతర ప్రాంతాలకు అక్రమంగా గ్రావెల్ తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇంటి అవసరాల కోసం కొంత గ్రావెల్ తవ్వుకుంటే కేసులు నమోదు చేసే అధికారులు ఈ అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూళ్లూరుపేటలో కొత్తగా ఏర్పాటు చేసే రియల్ ఎస్టేట్ వెంచర్లకు, కొన్నిచోట్ల పరిశ్రమలకు పెద్ద మొత్తంలో గ్రావెల్ అవసరమవుతోంది. దీన్ని అవకాశంగా తీసుకుని కొంతమంది అక్రమార్కులు రాజకీయ నేతల పలుకుబడితో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. పూలతోటమిట్టలో అసైన్డ్, సీజేఎస్ఎఫ్ భూముల్లో చీకటిపడితే చాలు ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ దొరికే గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులకు కలిసివచ్చింది. చీకటిపడితే చాలు దొరవారిసత్రం నుంచి సూళ్లూరుపేట వరకు గ్రావెల్ అక్రమ రవాణాచేసే టిప్పర్లు రయ్..రయ్ అంటూ తిరుగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ గ్రావెల్‌ను మన్నారుపోలూరు, శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో ఉండే వెంచర్లకు తోలి చదును చేస్తున్నా మౌనం వెనుక అర్థం ఆంతర్యం ఏమిటో? ఇప్పటికైనా అధికారులు గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

అక్కడ ఇసుక



అరుణా నదిలో ఇటీవల ఇసుక తరలింపు

'ఉచితం' మాటున నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వేస్తున్నారు. పగలంతా ఒక ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. రాత్రిళ్లు రాష్ట్ర సరిహద్దులు దాటించి తమిళనాడుకు తీసుకెళుతున్నారు. ఇలా రాత్రింబవళ్లు ఇసుక దందా సాగిస్తున్నా అధికారులు కిమ్మనడంలేదు. - సత్యవేడు, ఆంధ్రజ్యోతి

రాత్రింబవళ్లూ తవ్వేస్తున్నారు

● అరుణా నది నుంచి తమిళనాడుకు ఇసుక తరలింపు

నాగలాపురం మండలం నందనం వద్ద అరుణానదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నదిలో నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అరుణానది నారాయణవనం మండలంలోని కాకముఖ కొండల్లో పుట్టి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా ప్రవహిస్తూ, సురుటుపల్లె వద్ద తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి యాభై కిలోమీటర్ల మేర ప్రయాణించి ఎణ్నూరు వద్ద బంగాళఖాతంలోకి కలుస్తుంది. అరుణానది పరీవాహక ప్రాంతమంతా పచ్చని పంట పొలాలతో, బంగారు కాంతులు వెదజల్లుతూ మేటలు వేసిన ఇసుక తిన్నెలతో ప్రకృతి శోభను సంతరించుకుని కన్నులపండువగా ఉండేది. ఇదంతా గతం. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అరుణానదికి గర్భశోకం మొదలైంది. అడ్డగోలు అనుమతులతో ఐదేళ్ల పాటు రాత్రి, పగలు సాగిన వైసీపీ నేతల అక్రమ తవ్వకాలతో అరుణానది తన ఆనవాళ్లను కోల్పోయింది. పెద్ద పెద్ద హిటాచీలు, ఎక్స్‌కవేటర్‌లతో నదీగర్భంలో ఇరవై అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వి రోజుకు వందలాది లారీలతో ఇసుకను సరిహద్దు దాటించారు. ఫలితంగా అరుణానది పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు భారీగా అడుగంటాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కొన్ని రోజులు స్తబ్దుగా ఉన్న ఇసుక మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది.ఉచిత ఇసుక మాటున ట్రాక్టర్ల యజమానుల నుంచి ఇసుకను కొనుగోలు చేస్తూ మామిడి తోటలు, రహస్య ప్రాంతాల్లో భారీగా డంప్ చేసుకుని రాత్రికి రాత్రే తమిళనాడు, బెంగళూరుకు తరలిస్తున్నారు.ఉచిత ఇసుక విధానంలో యంత్రాలు వాడకూడదన్న నిబంధన ఉంది. ఈ నిబంధన ఉల్లంఘించి పట్టపగలే ఇసుక తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో?.

అక్రమ రవాణా ఇలా..

ప్రధానంగా అరుణా నది పరీవాహక ప్రాంతాల్లోని నాగలాపురం మండలం నందనం, సుబ్బానాయుడుకండ్రిగ, బయటకొడియంబేడు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తవ్వి గోపాలపురం, జడేరి, ఏఎంపురం మార్గాల్లో తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగ, పులికుంద్రం, అడవి కొడియంబేడు, ఎస్ఎస్‌బీ పేట, అప్పంబట్టు గ్రామాల నుండి సీతంజేరి, ఊత్తుకోట్టై మీదుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నారాయణవనం మండలంలో తుంబూరు, అరణ్యంకండ్రిగ తదితర గ్రామాల నుంచి విజయపురం మీదుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా పరిశ్రమల నిర్మాణం పేరుతో చెదులుపాక్కం మీదుగా ఇసుకను చెన్నైకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.



సత్యవేడులో ఇటీవల పట్టుబడిన ఇసుక డంప్

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండు కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 641మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు అభ్యర్థులు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ అధికారులు ఆయా సమయాల్లో ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. సమావేశంలో కుమార్ శ్రీవాస్తవ(ఢిల్లీ),జాయింట్ సెక్రటరీ శివకుమార్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు

1. శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీ, తిరుపతి
2. శ్రీపద్మావతి ఉమెన్స్ జూనియర్ కాలేజ్(వింగ్-ఏ), పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర, తిరుపతి

11న రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈ నెల 11న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో పెద్దయెత్తున రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పలుచోట్ల రైతుల భూ రికార్డులు తారుమారయ్యాయి. దీనిపై ఏడాది నుంచి పలుమార్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజాదర్బార్ ద్వారా వినతిపత్రాలు స్వీకరించారు. అందులో కొన్ని మాత్రమే పరిష్కారమయ్యాయి. ఈ విషయమై పలుమార్లు ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకాళహస్తిలో రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించేందుకు నిర్ణయించారు. 11న చేపట్టనున్న కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు.

1,54,980 మంది రైతులకు రూ.105కోట్లు

● రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధుల జమ



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఏపీసీడ్స్ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు మెగా చెక్కును, విత్తనాల కిట్లను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేలా తొలివిడత నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 1,54,980 మంది రైతుల ఖాతాల్లో రూ.105కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 90శాతం ఇన్‌పుట్ సబ్సిడీతో యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. క్రాప్ ఇన్సూరెన్సు అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 22వేల మంది రైతులు లబ్ధి పొందారని చెప్పారు. రైతులకు కూలీల సమస్యను నివారించేందుకు పది డ్రోన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకంపై గ్రీవెన్సు నిర్వహించారు. పథకానికి సంబంధించి సమస్యలు ఉంటే 9552300009 ద్వారా వాట్సాప్‌లో వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, రైతు సంఘాల నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో స్మార్ట్ కార్డులు సిద్ధం

● 15 లేదా 25 నుంచి పంపిణీ చేయనున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాలతో రేషన్ కార్డులు తయారు చేస్తోంది. నిత్యావసర సరుకులు తీసుకోవడానికే కాకుండా అన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగపడే విధంగా సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మోటారు వాహనాల లైసెన్సులు, ఆధార్ కార్డుల తరహాలో స్మార్ట్ కార్డులను రూపొందించారు. కార్డు మీద ఇంటి యజమాని ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు, రాజముద్ర, క్యూఆర్ కోడ్ ఉంటుంది. వీటిని ఈనెల 15 లేదా 25వ తేదీ నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 1,632 రేషన్ షాపుల పరిధిలో 6.25 లక్షల తెల్ల రేషన్ కార్డులున్నాయి. ఇప్పటివరకు రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులందరి ఫొటో ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుంది. సభ్యులవి పేర్లు మాత్రమే నమోదు చేస్తారు. గతంలో రైస్ కార్డులపై అధికారంలో ఉన్న సీఎం ఫొటో ఉండేది. తాజా స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుంది. ఇవి బ్యాంకు డెబిట్ కార్డులను తలపిస్తాయి. పారదర్శకతతో రేషన్ సరకులు పంపిణీ చేయడానికి వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేస్తారు. తద్వారా రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో అనధికార వ్యక్తులకు నో ఎంట్రీ : డీఈవో

తిరుపతి(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోకి అనధికార వ్యక్తులకు ప్రవేశాన్ని నిషేధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాబోధనకు ఆటంకం కలుగకుండా, విద్యార్థుల భద్రత,విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఇతర వ్యక్తులు, సంస్థలు, సంఘాలకు చెందిన వారు పాఠశాలల ఆవరణలోకి ప్రవేశించరాదని పేర్కొన్నారు.రాజకీయ పార్టీల కరపత్రాలు, జెండాలు, కండువాలు, బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శించరాదని తెలిపారు.

14న డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నిర్వహించే డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 14వ తేదీ స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీసీ కృష్ణమూర్తి కోరారు.

తిరునగరికి తగ్గనున్న ట్రాఫిక్ సమస్య

● విమానాశ్రయానికి పెరగనున్న కనెక్టివిటీ ● రూ. 113 కోట్లతో ఎన్‌హెచ్ పనులకు శంకుస్థాపన

తిరుపతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ. 113 కోట్లతో రెండు నేషనల్ హైవేస్ ప్రాజెక్టు పనులకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం మంగళగిరి నుంచీ సీఎం చంద్రబాబుతో కలసి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మదనపల్లె-నాయుడుపేట రోడ్డు బైపాస్ సెక్షన్‌కు సంబంధించి ఎన్‌హెచ్ 71లో తిరుపతి నగర శివార్లలో 22 కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల కింద రోడ్డు మార్కింగ్, ట్రాఫిక్ సైన్ బోర్డులు, సోలార్ బ్లింకర్లు వంటివి ఏర్పాటు చేయాల్సి వుంది.తిరుపతి వెలుపల పూతలపట్టు-నాయుడుపేట రోడ్డును మదనపల్లె - తిరుపతి రోడ్డును కలిపే ఈ రోడ్డు పనులు పూర్తయితే తిరుపతి నగరంపై మదనపల్లె వైపు నుంచీ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. మదనపల్లె వైపు నుంచీ వచ్చే వారు రేణిగుంట రైల్వే జంక్షన్‌కు, విమానాశ్రయానికి త్వరగా చేరుకోగలుగుతారు. ప్రయాణ వ్యవధితో పాటు కాలుష్యం కూడా తగ్గుతుంది. కాగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద, తడ-నెల్లూరు ఎన్‌హెచ్ 16వ సెక్షన్‌లో చిల్లకూరు సెంటర్ వద్ద రెండు కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 91 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ రెండు చోట్లా ఫోర్ లేన్ స్థాయిలో రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. ఆ పనుల్లో భాగంగా ఆరు చోట్ల బాక్సు కల్వర్టులు, రెండు చోట్ల పైప్ కల్వర్టులు, ఒక బస్ షెల్టర్ నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గనున్నాయి. కృష్ణపట్నం పోర్టుకు, షార్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రయాణ వ్యవధి, కాలుష్యం తగ్గుతాయి. ముఖ్యంగా స్కూలు పిల్లలకు, పాదచారులకు రోడ్డు ప్రమాదాల నుంచీ భద్రత కలగడమే కాకుండా చిల్లకూరు, శ్రీసిటీ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలపై 5న సమావేశం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల ఐదో తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ నేతృత్వంలో వివిధశాఖల అధికారులతో సమావేశం జరగనుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో 21 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు.

వంద టెంకాయలు రూ.2,500

పాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి కాయల ధర రికార్డుస్థాయికి చేరుకున్నాయి. వంద కొబ్బరికాయలను రైతుల వద్ద రూ.2,500లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పాలసముద్రం మండలంలో సుమారు మూడువేల ఎకరాల్లో విస్తారంగా కొబ్బరి తోటలున్నాయి. రెండు నెలలుగా కొబ్బరి ధరలు పెరుగుతూ ప్రస్తుతం వంద రూ.2,500 లకు చేరుకున్నాయి. రెండు నెలల కిందట వంద కొబ్బరి కాయలు రూ.15,00 పలికేవి. తమిళనాడు, కేరళ, మన రాష్ట్రంలో కొబ్బరి తోటలకు పిందెనల్లి తెగులు కారణంగా దిగుబడి తగ్గింది. దీనివల్లే ధరలు పెరిగినట్లు సమాచారం.

టౌన్ బ్యాంకులో గందరగోళం

ఎండీకి షోకాజ్ నోటీస్ ఇచ్చిన ఛైర్మన్

బోర్డుకు సంబంధంలేని అంశంపై ఛైర్మన్ జోక్యమేమిటంటున్న సిబ్బంది



శివకుమార్‌రెడ్డి

తిరుపతి(ఆటోనగర్),ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు (టౌన్ బ్యాంక్) కార్యకలాపాలు గందరగోళంగా మారుతున్నాయి. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్‌రెడ్డికి ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో ఉద్యోగులు విధులు నిలిపి నిరసన తెలిపే పరిస్థితికి వచ్చింది. రూ.6.92 లక్షలు రుణగ్రస్తుల నుంచి రికవరీ చేయని అంశంపై చీఫ్ మేనేజరు వి.వెంకటేశన్,మేనేజరు పి.వినోద్ బాబుపై ఉన్న సస్పెన్షన్‌ను ఎండీ రద్దు చేశారు. తన దృష్టికి తీసుకురాకుండా విధుల్లోకి తీసుకున్నందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ఛైర్మన్ షోకాజ్ నోటీస్ ఇచ్చారు. అయితే సహకార చట్టం 51 మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు బ్యాంక్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ చేస్తున్నారు. విచారణలో తప్పు ఉంటే జీతం నుంచి రికవరీ చేయవచ్చని నిబంధన మేరకు సస్పెన్షన్ ఎత్తివేసినట్టుగా అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది పూర్తిగా పరిపాలన అంశమని,సహకార చట్టం నిబంధనల మేరకు నిర్ణయం తీసుకునే అధికారం ఎండీకి ఉంటుందని తెలుస్తోంది. పాలకమండలి సిఫారసు మేరకు విచారణ జరిగివుంటే వారి దృష్టికి తీసుకెళ్లాలి కానీ వ్యక్తిగత కక్షతో బ్యాంకు పరువు బజారుకీడ్చుతున్నారని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగులను ఇబ్బందిపెడితే విధులను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు.

బీటెక్ (స్వీడన్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో బీటెక్ (స్వీడన్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నాలుగేళ్ల బీటెక్ కోర్సులో భాగంగా మూడేళ్లు ఎస్వీయూలోనూ, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదివే అవకాశం ఉంటుంది. ఈనెల 4 నుంచీ 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీయూడీవోఏ.. వెబ్‌సైట్‌ను చూడవచ్చని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు తెలిపారు.

చంద్రగిరి

అమ్మవారి సేవలో గడ్కరీ దంపతులు



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దంపతులు

తిరుచానూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని శనివారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, టీటీడీ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి దంపతులు ధ్వజస్తంభానికి నమస్కరించి సన్నిధిలోని పద్మావతి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అర్చకులు బాబుస్వామి, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్, గాలి పుష్పలత తదితరులు పాల్గొన్నారు. గడ్కరీకి రేణిగుంట విమానాశ్రయంలో మధ్యాహ్నం కలెక్టర్ వెంకటేశ్వర సాదర వీడ్కోలు పలికారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపి పంచాయతీలను అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో శనివారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని జరిగింది. ఇటీవల మరణించిన చెర్లోపల్లె సర్పంచ్ సుభాషిణికి తొలు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అవిలాలలో 33కేవీ లైన్‌ని మార్పుచేసిన విద్యుత్ అధికారులు.. ఎస్సీకాలనీలో రెండుపోల్స్ దూరాన్న మాత్రం మార్చకుండా వదిలేశారని, జాతీయరహదారి విస్తరణలో భాగంగా పూడ్చేసిన పేరూరు చెరువు కాలువను పునరుద్ధరించి స్వర్ణముఖి నీరు చేరేలా చర్యలు చేపట్టాల లాంటి తదితర సమస్యలను సభదృష్టికి తెచ్చారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ.. ఆయా విభాగాల అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైఎస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, వేముల యశోద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ రామాంజులనాయక్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రేణిగుంటరోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో అమరా ఆసుపత్రి సౌజన్యంతో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావుతో కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి, సెక్రటరీ లక్ష్మీప్రశస్తలు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ..రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించవారవుతామని, ప్రతిమూడు మాసాలకోసారి రక్తదానం చేయడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. అమరా ఆసుపత్రి పాథాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్, ఏజీఎం శ్రీధర్, చీఫ్ ఆపరేషన్ అధికారి భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ బెహరా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రైతు సంక్షేమం

రామచంద్రాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. గంగిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అన్నదాతసుఖీభవ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, చిన్నబాబు, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, మునిరామిరెడ్డి, సురేంద్ర నాయుడు, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు మహాభారత ఉత్సవాల్లో అగ్నిగుండ ప్రవేశం



తిరుపతి రూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలో మహాభారత వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లు ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ఆదివారం రాత్రి 8.30గంటలకు జరగనుంది. దీనికి ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పరిసరగ్రామాలకు చెందిన వందలాదిమంది భక్తులు కంకణధారణ ధరించి భక్తిశ్రద్ధలతో ఈఅగ్నిగుండ ప్రవేశం చేయాలని కోరారు. అలాగే ఉదయం 10.30గంటలకు దుర్యోదనవధ నాటకం ఉంటుందని, ఉభయదారుడిగా నాదమునిరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్ధసారథిది, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి రోగులకు వైద్యం సక్రమంగా అందడం లేదని, బీసీ గురుకుల పాఠశాలలో వసతులు సరిగా లేవని ఫిర్యాదులు అందడంతో వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ న్యాయవాదులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. తొలుత ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన ఆయన వైద్యం సక్రమంగా అందుతోందా లేదా అని రోగులతో మాట్లాడి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా.. మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వసతులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం న్యాయమూర్తి బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. మెనూను పరిశీలించారు. చాలినంత భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన వాటిని మరమ్మతులు చేసి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్యాయత్నం

● డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



సురేంద్ర

పాకాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనమిది. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన బి.సురేంద్ర అనే పాతికేళ్ల యువకుడు తిరుపతిలో ప్రైవేటు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అక్కడే గది అద్దెకు తీసుకొని వున్నాడు. భార్యాపిల్లలు ఉరవకొండలోఉన్నారు. శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంలో వచ్చి రైల్వే స్టేషన్ ఎదుట పార్క్ చేశాడు. ధర్మవరం నుంచి నర్సాపూర్ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడ్డాడు. డ్రైవర్ గమనించి రైలు ఆపడంతో యువకుడు గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. వ్యసనాలకు బానిసై అప్పులు చేసి తీర్చలేక, అప్పులు ఇచ్చినవారికి మొహం చూపించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు.

అలరించిన కౌరవ, పాండవ విద్యాభ్యాస ఘట్టం



రామచంద్రాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ కమ్మపల్లిలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం భగవతారిణి జ్యోత్స్న ఆలపించిన కౌరవ, పాండవ విద్యాభ్యాసం అలరించింది. ఈ సందర్భంగా ద్రోణాచార్యుల వద్ద పాండవులు, కౌరవులు విద్యను అభ్యసించడం.. పాండవుల మీద ద్వేషంతో లక్క గృహానికి నిప్పు పెట్టి హతమార్చాలని ప్రయత్నించే ఘట్టాలను భాగవతారిణి చక్కగా వినిపించారు. అంతకుముందు ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజ మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ధర్మకర్త రమేష్‌బాబు, గ్రామ పెద్ద మార్కొండయ్యనాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడుడు హరి స్వామి పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ



చెక్కు ప్రదర్శిస్తున్న మౌనిక,తదితరులు

తిరుపతిరూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మొదటివిడత నిధుల విడుదల సందర్భంగా శనివారం తనపల్లె రైతుసేవాకేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. మండలపరిధిలో 2,919మంది రైతుల ఖాతాలకు రూ.1.94కోట్లు జమ అయ్యాయి. మండలానికి మంజూరైన రూ.1.94కోట్ల నిధులను చెక్కురూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ యు.మౌనిక, మల్లంగుంట సింగిల్‌విండో ఛైర్మన్ మధుశేఖర్, డైరెక్టర్లు చిరంజీవి, మోహన్‌రెడ్డి, టీడీపీమండలపార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, నీటి సంఘం ఆయకట్టు అధ్యక్షుడు మునికృష్ణయ్యయాదవ్, వ్యవసాయాధికారి సుబ్బారావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. **ఏర్పేడు:** చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల సందర్భంగా శనివారం రైతులతో తహసీల్దారు భాగ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఏవో ధనలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 4359 మంది రైతులకు రూ.3.07 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

7.3 కిలోల గంజాయి స్వాధీనం యువకుడి అరెస్ట్

తిరుచానూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ శేషాద్రి నగర్ హౌసింగ్ కాలనీలో ఓ యువకుని అరెస్టు చేసి 7.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ కథనం మేరకు రామకృష్ణ అలియాస్ నాని అనే యువకుడు పాడిపేట హౌసింగ్ కాలనీలో ఉంటున్నాడు. అతను గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సీఐ సిబ్బందితో వెళ్లి నానిని అరెస్టు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి ఆటో బోల్తా 9మంది మహిళలకు గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో 9మంది మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పల్లమాల గ్రామం దగ్గర చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సీసీఎల్ కంపెనీలో పని చేస్తున్న 9 మంది మహిళలు శనివారం ఉదయం డ్యూటీ ముగించుకుని శ్రీకాళహస్తిలోని తమ ఇళ్లకు వెళుతుండగా మండలంలోని పల్లమాల గ్రామం దగ్గర ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న మెరిమి వనమ్మ, ప్రమీల, లత, మల్లేశ్వరి, పెంచలమ్మ, అంజలి, జ్యోతి, శోభ, వాలేటమ్మతో పాటు డ్రైవర్ రాజాకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన వారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' రైతులకు వరం

ఎమ్మెల్యే పులివర్తి నాని





చంద్రగిరిలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని- కె.వడ్డేపల్లె రైతు సేవాకేంద్రంలో చెక్ ప్రదర్శిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

చంద్రగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరంలాంటిదని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబురైతు కుటుంబం నుంచి వచ్చినందున రైతుల కష్టాలు తెలుసన్నారు. అన్నదాతకు ప్రభుత్వం అండదండగా ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో రైతులను నట్టేట ముంచిందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 26062 మంది రైతులకు రూ.1,78,578 కోట్ల మేర లబ్ది చేకూరిందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుతుందన్నారు. రైతులు కోసం సబ్సిడీ ద్వారా పనిముట్లు, యూరియా, ట్రాక్టర్లు, వేరుశనగ విత్తనాలు, ఇతర సామాగ్రిని రాయితీతో ఇస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, ఆర్డీవో రామ్మోహన్, ఏడీఏ మరోహర్‌బాబు, డీడీఏ మల్లికార్జునయ్య, ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జేసీ

పాకాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో రైతుల ఖాతాలకు జమచేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. కెవడ్డేపల్లె రైతు సేవాకేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షురాలు సావిత్రి, టీడీపీ నాయకుడు మహేష్ కుమార్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. మండలంలో 5029 మంది రైతుల ఖాతాలలో రూ.3.52 కోట్ల రూపాయలు జమచేస్తున్నామన్నారు.సర్పంచ్‌లు కె వరలక్ష్మీ, చెంగల్రాయులు, డిప్యూటి తహశీల్దార్ కళ్యాణ్, మండల వ్యవసాయాధికారిణి హరిత కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మణీంద్రం ఎంపీటీసీ ఎన్నిక ఏకగ్రీవం?

వైసీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

రామకుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శనివారం జరిగింది. నామినేషన్ దాఖలు చేసిన వారిలో టీడీపీ తరఫున అత్తికుప్పానికి చెందిన ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ, మణీంద్రంకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి భార్య విశాలాక్షి, వైసీపీ తరఫున అకుందగానిపల్లెకు చెందిన ఆ పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి కుమార్తె అర్పిత ఉన్నారు. విశాలాక్షి సమర్పించిన నామినేషన్ పత్రాల్లో ప్రతిపాదించే వారు సంతకం చేయాల్సిన చోట విశాలాక్షి సంతకం చేయడంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. వైసీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన అర్పిత తమ ఆస్తుల పూర్తి వివరాలు పొందుపరచకపోవడం, రామకుప్పం పట్టణంలోని భవనాలకు సంబంధించి పన్ను బకాయి ఉండడంపై ఫిర్యాదులు రావడంతో పరిశీలన అనంతరం ఆమె నామినేషన్‌ను కూడా తిరస్కరించినట్లు ఆయన తెలిపారు.నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో వారికీ విషయాన్ని పోస్టు ద్వారా సమాచారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.కుప్పం ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఆదివారం అప్పీలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అప్పీళ్లపై సోమవారం తుది నిర్ణయం ఉంటుందన్నారు.నామినేషన్ల పరిశీలన అనంతర పరిస్థితులు చూస్తుంటే ఉప ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.టీడీపీ మద్దతుదారు విశాలాక్షి, వైసీపీ అభ్యర్థి అర్పిత నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించడంతో ప్రస్తుతానికి అరుణ ఒక్కరే బరిలో మిగిలారు. నామినేషన్ల పరిశీలనకు వైసీపీ అభ్యర్థి అర్పిత గాని.. ఆమెను ప్రతిపాదించిన వారు గాని హాజరు కాకపోవడం చూస్తుంటే ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే అప్పీలు కార్యక్రమానికి హాజరవడం అనుమానమేనని భావిస్తున్నారు. ఇదే జరిగితే మణీంద్రం ఎంపీటీసీ టీడీపీ కైవసమవుతుంది.

పింగళి వెంకయ్యకు ఘన నివాళులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శనివారం పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠ శాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం శ్రీదేవి, స్కౌట్ మాస్టర్లు ఎస్కే అజారుద్దీన్, వెంకటాద్రి, యోగానందం, మురళి పాల్గొన్నారు.

ప్రధాని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ నిధుల విడుదలపై ప్రధానమంత్రి మోదీ ప్రసంగాన్ని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు తిలకించారు. శనివారం మండలంలోని చైతన్యపురం కేవీకేలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసులు, విశ్రాంత ఆత్మ ప్రాజెక్ట్ ఉపసంచాలకులు విజయచంద్ర నాయుడు, కేవీకే హెడ్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు పద్మజ, సుధాకర్, దివ్య, రాము కుమార్,పాల్గొన్నారు.

పులి వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి



నారాయణవనం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీకి అనుబంధగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం నవసంధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో సాగింది. పులి వాహనంపై గ్రామ వీధులలో ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి

రేణిగుంట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం వద్ద యువకుడిపై బీరు బాటిల్‌తో కొందరు దాడిచేశారు. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు...స్థానిక చెంచు వైన్స్ వద్దా శ్రీకాళహస్తి రోడ్డులో కాపురం ఉంటున్న సతీష్ మద్యం సేవిస్తుండగా మరో బ్యాచ్‌తో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఆటో తోలుతున్న ఓ వ్యక్తి అతడి స్నేహితులు కలిసి బీరు బాటిల్‌తో సతీష్ తలపై కొట్టారు. అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సతీష్‌ను కుటుంబసభ్యులు రుయాకి తరలించారని సమాచారం.

అదుపు తప్పిన ట్రాక్టరు ముగ్గురికి తీవ్ర గాయాలు



వరదయ్యపాళెం, ఆగస్టు2, (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వరదయపాళెం మండలం సంతవేలూరు పంచాయతీ బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట మార్గంలో జరిగింది. సూళ్లూరుపేట నుంచి బీఎన్ కండ్రిగ వైపు వెళుతున్న ఓ ఇటుక ట్రాక్టరు కువ్వాకుల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో అదుపుతప్పింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సూల్లూరు పేట మండలం పెరటిపాడుకు చెందిన ముగ్గురు కూలీలు ఇటుకల మధ్యలో ఇరుక్కుపోయారు. స్థానికులు వారిని రక్షించి 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలపై 5న సమావేశం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల ఐదో తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ నేతృత్వంలో వివిధశాఖల అధికారులతో సమావేశం జరగనుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో 21 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈవో కార్యాలయ భవనం వద్ద ఉన్న సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి జిల్లా, మండలస్థాయి అధికారులు, ఆలయ ఉభయదారులు తప్పక హాజరు కావాలని కోరారు.





కారిజాత చెరువులో మట్టి తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు - రాత్రిపూట మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చెరువులనూ తవ్వేస్తున్నారు!

● రెచ్చిపోతున్న మట్టి మాఫియా
● వైసీపీ హయాంలో చెలరేగిన అక్రమార్కులు
● కూటమి ప్రభుత్వం వచ్చినా మారనితీరు
● యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చీకటి పడితే చాలు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం వచ్చినా తగ్గడం లేదు. ఇటీవల కారిజాత, కుదిరి, కోటపోలూరు చెరువుల్లో జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదంతా పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతందనే ఆరోపణలు ఉన్నాయి.సూళ్లూరుపేట మండలం కుదిరి, కోటపోలూరు చెరువులతో పాటు, తడ మండలం కారిజాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు పెరిగిపోయాయి. చీకటి పడితే కారిజాత చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా సూళ్లూరుపేట పట్టణంలోని కొత్త వెంచర్లు, ఇళ్ల ప్లాట్లకు తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు కారిజాత చెరువు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తీసుకుని దావాదిగుంట, షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం మీదుగా షార్ రోడ్డులో మట్టిని తరలిస్తున్న సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని తవ్వి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. చెరువులను కాపాడాల్సిన నీటి సంఘ అధ్యక్షుడు అక్రమార్కులతో చేతులు కలిపి మౌనంగా ఉండిపోతున్నారు. గత వారం రోజుల నుంచి కారిజాత చెరువులో పది అడుగుల మేర మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. మట్టి అక్రమ రవాణాపై గ్రామస్తులు పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కాళంగి నది నుంచి ఇసుక అక్రమ రవాణా నిషేధం ఉన్నా అక్రమార్కులు నిత్యం తవ్వి డంపింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అవధాన బాలభాస్కరం పుస్తక పరిచయం



అవధానం బాల భాస్కరం పుస్తకావిష్కరణ

తిరుపతి(జీవకోన), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అవధాన ప్రక్రియలోని పలు రకాల విన్యాసాలకు నిలయం అవధాన బాల భాస్కరం పుస్తకమని శతవధాని, ప్రవచనకర్త ఉప్పలదడియం భరత్‌శర్మ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను దేశ, విదేశాల్లో 3 శతావధానాలు, 87 అష్టావధానాలు నిర్వహించానన్నారు. అందులో భాగంగా మొదటి 50 అష్టావధానాలను "అవధాన బాలభాస్కరం-2 పేరుతో పుస్తక రూపంలో తీసుకువచ్చాన్నారు. దీనిని గత నెలలో తన గురువు త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ వారణాసిలో ఆవిష్కరించారన్నారు. తిరుపతి ప్రజలకు ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తునామమన్నారు. అనంతరం అవధాన బాలభాస్కరం పుస్తకాన్ని ప్రదర్శించి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీసీ సభ్యురాలు కిడాంబి ప్రమీలమ్మ, శ్రీచక్ర ఆస్పత్రి, ఫుడ్‌సైడ్ హోటల్స్ అధినేత డాక్టర్ అర్చన, శతవాధాని ఆముదాల మురళి పాల్గొన్నారు. భరత్‌శర్మ వారిని సత్కరించారు.

నేడు బీఎంఎస్ ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఎస్ నాయుడు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కచ్చపి ఆడిటోరియంలో ముగింపు సభను నిర్వహించనున్నట్లు ఈ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్‌నాయుడు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సంఘ్ ఉపాధ్యక్షుడుమల్లేశంతో పాటు గౌరవ అతిథులుగా దువ్వూరి యుగంధర్, రఘురాం పాల్గొంటారన్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే సభలో 70ఏళ్ల సంఘ్ ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరుగుతుందన్నారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలలో నిషేధ ఉత్తర్వులు సరికాదు

తిరుపతి(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నిషేధ ఉత్తర్వులు ప్రజాస్వామ్య హక్కులను హరించేలా ఉందని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) నాయకులు విమర్శించారు. పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులుతప్ప మరెవ్వరూ పాఠశాలల ఆవరణలోకి అడుగుపెట్టరాదన్న నిషేధ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లిఖార్జున డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బయటికి రాకుండా విద్యార్థుల నోరునొక్కే ప్రయత్నమే ఇదన్నారు. ఉత్తర్వులను రద్దు చేయకపోతే అన్ని విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి పోరాటం చేస్తామన్నారరు.

ముర్రుపాలలో రోగనిరోధకశక్తి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు అనేక పోషక గుణాలను కలిగివుంటాయని వాటిని పుట్టిన బిడ్డలకు తాగిస్తే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రెండోవ రోజు ఆయన స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమి వాటిని మొదటి నుంచి పట్టించడం వలన బిడ్డలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదుగుతారన్నారు. పాలిచ్చే తల్లుల క్రమం తప్పకుండా చక్కటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఎమరాల్డ్స్ కాలేజీలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అధ్యాపకురాలు కోనప్రభ మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. ● పద్మావతి డిగ్రీ కాలేజీలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా వర్సిటీ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు రాణి మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల క్రీడోత్సాహం



క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని రోజులుగా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మహిళా ఉద్యోగులకు చెస్, క్యారమ్స్, షటిల్ పోటీలు నిర్వహించారు. పోటీలకు మంచి స్పందన వచ్చింది. ఇవిజేతలకు వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం, మనోజ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలకు ఆచరణ రూపం ఇవ్వాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మంచి ఆలోచనలకు ఆచరణ రూపం ఇవ్వడం ద్వారా ఎంచుకున్న రంగంలో ఎవరైనా రాణించడానికి అవకాశం ఉంటుందని మ్యాగ్స్‌మెన్ సంస్థ ప్రతినిధి ఎన్. సందీప్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎంటర్‌ప్రైనర్షిప్ గురించి శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో ఔత్సాహికులు కాలానుగుణమైన పరిస్థితులను అవగాహన చేసుకోవాలని కోరారు. మంచి బృందాన్ని ఏర్పాటు చేసుకోవడం, తాము వ్యాపారం చేయబోయే అంశం గురించి చక్కగా తెలియ చేయడం, వినియోగదారుల నుంచీ సక్రమంగా ఫీడ్ బ్యాక్ తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవకు నివాళి



రాఘవ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ ప్రముఖులు బళ్ళారి రాఘవకు జిల్లా ఎస్పీ హర్షవర్దనరాజు ఘన నివాళి అర్పించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాఘవ జయంతి కార్యక్రమం శనివారం పద్మావతి యూనివర్సిటీ సావేరీ సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్ళారి రాఘవ చిత్రపటానికి ఎస్పీ హర్షవర్దనరాజు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఛాన్స్

తిరుపతి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారిక లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. క్రమబద్ధీకరణ పథకాన్ని సవరించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఈఏడాది జూన్ 30 వరకు వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుంతో పాటు 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. లైసెన్సు సర్వేయర్, ఇంజనీర్లు, ఆర్కిటెక్టు ద్వారా అనధికార లేఅవుట్ (నాన్-లేఅవుట్) లోని స్థలం ప్లాన్లు తయారు చేయించుకోవాలన్నారు. అపరాధ రుసుంలో 50శాతం చెల్లించి, 90 రోజులు లోపు (24-10-25లోపు) ఐఆర్ఎస్‌డీటీసీపీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నగరపాలక సిబ్బంది తనిఖీ చేశాక క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుదారులకు సంబంధించి ఫీజులు, డాక్యుమెంట్లు సమర్పించి క్రమబద్ధీకరించు కోవాలని అన్నారు. క్రమబద్ధీకరించని అనధికార లేఅవుట్లు, ప్లాట్లపై జరిమానా విధిస్తామన్నారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, డ్రైనేజీ కాలువ సదుపాయాలు అనుమతించబోమన్నారు. మరిన్ని వివరాలకు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను సంప్రదించాలని కోరారు.

వినాయకసాగర్‌లో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య ● సాగర్‌లో గ్లోగార్డెన్ ప్రారంభం





ఆకర్షణీయంగా గ్లోగార్డెన్ - గ్లోగార్డెన్ ప్రారంభంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, నరసింహయాదవ్ తదితరులు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్‌లో నాట్య గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యలు తెలిపారు. శనివారం సాయంత్రం స్మార్ట్ సిటీ మిషన్ కింద వినాయక సాగర్‌లో ఏర్పాటు చేసిన గ్లోగార్డెన్‌ను వారు ప్రారంభించారు. రూ.1.25కోట్లతో నిర్మించిన గ్లోగార్డెన్ లైటింగ్‌థీమ్‌తో చెట్లు, పెంపుడు జంతువుల ఆకృతులను పిల్లలను ఆకర్షించేలా విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెండింగ్ పనులను పూర్తి చేస్తూ వస్తోందన్నారు. వాకింగ్ ట్రాక్ మరమ్మతులుచేయడంతో పాటు మౌలిక వసతులను కూడా కల్పించామన్నారు. స్విమ్మింగ్ పూల్ ప్రారంభించామన్నారు. హుస్సేన్ సాగర్‌లో గౌతముద్దుని విగ్రహం తరహాలో నాట్య గణపతి విగ్రహాన్ని వినాయకసాగర్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసతుకుంటామన్నారు. డ్రైనేజీ నీరు సాగర్‌లోకి రాకుండా చర్యలు తీసుకుని ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏపీబ్యూటీకేషన్ అండ్ గ్రీనరీ బోర్డు చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ డిప్యూటీ మేయర్లు ఆర్‌సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, అనిల్ కుమార్, నరసింహాచారి, నరేంద్ర, అన్నా అనిత, రాజారెడ్డి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, అధికారలు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పీ-4 సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పీ-4సర్వే పురోగతిపై శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సెక్టోరల్ ఆఫీసర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు బంగారు కుటుంబాలను స్వయంగా పరిశీలించి వారి స్థితిగతులను పక్కగా నమోదు చేయాలన్నారు. ఆయా సచివాలయ పరిధిలో కూడా సెక్రెటరీలు శ్రద్ధతో పీ4 సర్వేపై పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపికలో పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థల ఆక్రమణపై బాధితుడు ఫిర్యాదు



స్థలం డాక్యుమెంట్లను చూపిస్తున్న బాధితుడు

తిరుపతి అర్బన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి ఆలయం నిర్మించడానికి కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి రేకులషెడ్డు ఏర్పాటు చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుడు వెంకటసుబ్బయ్య శనివారం ఆక్రమిత స్థలం వద్ద శనివారం నిరసనకు దిగారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అర్బన్ మండలం కొంకచెన్నయ్యగుంట గ్రామ లెక్కదాఖల, సర్వేనెంబర్ 173/1, రవీంద్రనగర్, ఒకటో క్రాస్‌లో దాదాపు ఎకరా భూమిని పందేటి రాధాకృష్ణరాజు 2008లో తనకు విక్రయించారన్నారు. అందులో కొంత స్థలాన్ని వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేటర్ సాయంతో ఓ కానిస్టేబుల్ రోడ్డుపక్కన ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి రేకులషెడ్డు వేశారన్నారు. దీంతో అలిపిరి పోలీస్‌స్టేషన్, అర్బన్ తహసీల్దార్లకు పిర్యాదు చేశామన్నారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు ఈ స్థలాన్ని పరిశీలించారు. నిషేధిత జాబితాలోని ఈ స్థలాన్ని ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు.

5 నుంచి జిల్లా స్పోర్ట్స్ మీట్ : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జిల్లా, జోనల్ స్పోర్ట్స్‌మీట్ ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం రాత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ నెల 29న జాతీయ స్పోర్ట్స్‌డే పురస్కరించుకుని జిల్లా అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో వివిధ జిల్లాలకు చెందిన ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, కోకో, షటిలఖ్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జిల్లాస్థాయి, 11 నుంచి 15 వరకు జోనల్ స్థాయి, 16 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి పోటీలురాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకోసం టీటీడీ, ఎస్వీ యూనివర్శిటీ, నగరపాలకసంస్థ సమన్వయంతో పనిచేయాలన్నారు. మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా సాగింది. భజన మండలి కళాకారులు సంప్రదాయ వస్త్రధారణ, తిరునామం ధరించి నగర వీధుల్లో గోవిందనామ స్మరణ చేశారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి వాసుదేవరెడ్డి, మేకల గంగయ్య, భాస్కరాచారి, చెంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మధు, విక్రమ్, పద్మావతి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ప్రదీప్‌కుమార్ ఆనంద

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ మనో వైజ్ఞానిక శాస్త్ర పరిశోధకులు ప్రదీప్‌కుమార్ ఆనంద డాక్టరేట్ పొందారు. సైకో సోషియల్ ఫ్యాక్టర్స్ ఇన్‌ఫ్లూయెన్సింగ్ ఓటింగ్ బిహేవియర్ అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ప్రస్తుతం ప్రదీప్‌కుమార్ ఆనంద, అమరరాజాలో సైకాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఈమేరకు ఎస్వీయూ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

5 నుంచి పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్‌యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్లకు ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచిలకు ఎన్‌బీయే గుర్తింపును 2028 సంవత్సరం వరకు పొడించినట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణులై, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే విద్యను అభ్యసించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతల జిరాక్సు పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకు రావాలన్నారు. అలాగే ప్రవేశ రుసుం, ప్రాసెసింగ్ రుసుం స్పాట్ అడ్మిషన్ రోజునే చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.● కేఈసీలో: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల్లో మొదటి సంవత్సరానికి గాను ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుధాకర్‌బాబు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫీజుతో అడ్మిషన్లకు హాజరు కావాలని చెప్పారు. ఇతర వివరలకు ఫోన్‌నంబర్ 9542423396 ను సంప్రదించాలని కోరారు.

ర్యాగింగ్ వ్యతిరేక పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్ రూపొందించిన ర్యాగింగ్ వ్యతిరేక పోస్టర్లను ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. తోటి విద్యార్థులపై స్నేహ పూర్వక భావన ఏర్పరుచుకోవాలన్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు వెంకటేష్ నాయుడు, నాయకులు సందీప్, షారీఫ్, విజయ్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 9, 11 తరగతుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. 2026 ఫిబ్రవరి 7వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఏదేని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు. ఈనెల 23వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 8688888802 / 9399976999 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరస్తుల వలలో డాక్టర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రూ.90వేలకు బురిడీ కొట్టించారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు స్థానిక పెద్దకాపులేఅవుట్‌కు వైద్యురాలు దామినేడు రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నారు. గతనెల 31న ఆమెకు పరిచయమున్న మరో డాక్టర్ మొబైల్ ఫోన్‌ను దుండగులు హ్యాక్ చేసి ఆమె దామినేడు వైద్యురాలికి వాట్సాప్ కాల్ చేశారు. అర్జెంటుగా రూ 90,000 అవసరమనేది కాల్ సారాంశం. నమ్మిన డాక్టర్ ఆ మొత్తాన్ని పంపారు. అనంతరం బాధితురాలు ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా అని అడిగారు. తాను డబ్బులు అడగలేదని అవతలి డాక్టబదులివ్వడంతో బాధితురాలు అవాక్కయ్యారు. శనివారం తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఎస్ఐకు పిర్యాదు చేశారు.

నేడు గంగిశెట్టి శివకుమార్ అభినందన సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత గంగిశెట్టి శివకుమార్ అభినందన సభ అదివాంరం జరుగుతుంది. ఉదయం 10 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని ఓఆర్ఐ - శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్తంగా నిర్వహిస్తాయి. ఇందులో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అవధాని మేడసాని మోహన్ పాల్గొంటారు. ఈ మేరకు ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సుహాస్


డ్రమ్స్ శివమణి, ఆది, అశ్విన్‌బాబు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ హీరోలు ఆది, అశ్విన్‌బాబు, సుహాస్, సంగీత దర్శకుడు తమన్, డ్రమ్స్ శివమణి, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారులు ఎల్లా వెంకటేశ్వరరావు, తానా మాజీ అధ్యక్షుడు వీ సతీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందని వచ్చా


వచ్చేవారం నుంచి తాను తమిళంలో నటించబోతున్నానని, ఈ క్రమంలో స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో తిరుమలకు వచ్చానని హీరో సుహాస్ తెలిపారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లో తమిళ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు.

కోదండరాముడికి స్వర్ణ తులసిహారం బహూకరణ


హారంతో డిప్యూటీ ఈవో నాగరత్న

తిరుపతి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామికి శనివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసీహారం బహూకరించారు. రూ.26లక్షల విలువైన 257గ్రాముల పసిడితో తులసిదళాలు, వాటిపై గాయత్రి బీజాక్షరాలు పొందుపరిచారు. ఈ హారాన్ని దాత ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నకు అందజేశారు. విశేష ఉత్సవాలలో మూలవర్లకు దీన్ని అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,353

తలనీలాలు సమర్పించినవారు: 25,636

అభిమానుల్లో ఉండే ఎనర్జీ నాలోనూ ఉంది

● 'కూలీ' ట్రైలర్ రిలీజ్ వేడుకలో రజనీకాంత్



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభిమానుల్లో ఉండే ఎనర్జీ తనలోనూ ఉందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఆయన హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'కూలీ' చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శనివారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు, సత్యరాజ్‌కు అభిప్రాయభేధాలుండొచ్చు, కానీ ఆయన మనసులో వచ్చిన మాటను నిర్మొహమాటంగా చెప్పి వెళ్లిపోతుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారిని నమ్మొచ్చు. కానీ, మనసులో ఒకటి, బయట ఒకటి పెట్టుకుని వుండేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకూడదు' అన్నారు. 'ఎన్ని రోజులని నేను మంచిగా నటించాలి' అని హీరో అజిత్ కుమార్‌కు దర్శకుడు వెంకట్ ప్రభు ఒక డైలాగ్ రాశాడు. ఆ విధంగానే ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ఒక పాత్రలో నటించారు' అని రజనీకాంత్ అన్నారు.అనంతరం అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'ఒక కూలీ వంద బాషాలకు సమానం. నిజమైన సూపర్‌స్టార్ రజనీకాంత్. ఓజీ సూపర్‌స్టార్ అంటే రజనీకాంత్. యూ ఆర్ ది సూపర్ స్టార్ ఆఫ్ ది ఇండియన్ సినిమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ, 'నా తండ్రి ఒక బస్సు కండక్టర్. ఆయన నంబరు 1421. ఆ నెంబరును ఈ సినిమాలో రజనీకాంత్‌కు ఉపయోగించాను. ఇది నా తండ్రికి నేను ఇచ్చే ఒక గౌరవంగా భావిస్తున్నా' అన్నారు.హీరోయిన్ శృతి హాసన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నాకు ఒక మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు లోకేశ్‌కు ధన్యవాదాలు. మా నాన్నకు 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీని ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఆ చిత్రం నుంచి నేను మీ అభిమానిగా మారిపోయాను' అన్నారు. ఈ ఆడియో వేడుకల్లో బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14వ తేదీన తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్‌కానుంది.

ఫ్యాన్స్ అత్యుత్సాహం.. స్వల్ప తోపులాట : 'కూలీ' ఆడియో రిలీజ్ వేడుక జరిగిన నెహ్రూ ఇండోర్ స్టేడియం వద్ద రజనీకాంత్ అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు.వేడుకను తిలకించేందుకు పాసులున్నవారిని మాత్రమే అనుమతించారు. అయితే, పెద్ద ఎత్తున ఫ్యాన్స్ స్టేడియం వద్దకు చేరుకుని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో అభిమానులంతా ఒక్కసారిగా ముందుకు తోసుకు వెళ్ళడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్ కూడా కిందపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. పరిస్థితిని చక్కదిద్దారు.



నేడు స్నేహితుల దినోత్సవం

స్నేహం చూపిన ఔదార్యం

● ఎస్వీ వైద్య కళాశాలకు బాసట

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వారంతా కలిసి చదువుకున్నారు. కాలం గడుస్తున్నా వారి స్నేహం చెక్కు చెదరలేదు. ఎక్కడెక్కడో ఉన్నా అప్పుడప్పుడయినా కలుస్తున్నారు. నాటి సంగతులను కలబోసుకుంటున్నారు. గురువులను సత్కరిస్తున్నారు. అక్కడితో ఆగిపోలేదు. తమను ఒక్కటి చేసిన స్నేహబంధం వారిలో సేవా దృక్పథాన్ని పెంచింది. తమను ఉన్నత స్థాయికి చేర్చేందుకు బాటవేసిన విద్యాలయాభివృద్ధికి చేతులు కలిపేలా చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ వైద్య కళాశాలకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు కళాశాలకు బాసటగా నిలుస్తున్నారు. స్నేహితులుగా సేవా సుమాలను పూయిస్తున్నారు.


రూ.15 లక్షలతో కళాశాల క్రీడామైదానానికి ప్రహరీ, పెవిలియన్ నిర్మించిన 1991 బ్యాచ్ విద్యార్థులు


రూ. 5 లక్షలతో ఫార్మకాలజీ విభాగానికి ఫర్నిచర్‌ను అందజేసిన 2004 బ్యాచ్ స్నేహితులు

● ఎస్వీ వైద్య కళాశాలలో 2004లో వైద్య విద్యను పూర్తి చేసిన పలువురు ఇప్పటికే స్నేహ బృందంగా ఏర్పడ్డారు. అప్పుడప్పుడూ కళాశాలకు వస్తూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కళాశాలకు ఆర్థికపరంగా చేయూత అందిస్తున్నారు. ఇటీవల ఫార్మకాలజీ విభాగానికి అవసరమైన రూ.5 లక్షల విలువచేసే బీరువాలను, కంప్యూటర్లను అందజేశారు.

● కళాశాలలో 1991లో వైద్య విద్యను పూర్తి చేసిన మరో కొందరు విద్యార్థులు ఇప్పటికీ స్నేహన్ని కొనసాగిస్తూ కళాశాలపై ఉన్న మమకారం చాటుకుంటున్నారు. భవిష్యత్తు తరాల విద్యార్థుల కోసం రూ.15 లక్షలతో కళాశాల క్రీడా మైదానానికి ప్రహరీని, పెవీలియన్‌ను నిర్మించి ఔదార్యాన్ని ప్రకటించారు.

● 1987, 1995 బ్యాచ్ విద్యార్థులు కూడా స్నేహితుల సమూహంగా ఏర్పడ్డారు. కళాశాలలోని విద్యార్థులను కలిసేందుకు వచ్చే తల్లిదండ్రులు వేచి ఉండేందుకు అవసరమైన రెండు ప్రత్యేక గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు అందజేశారు. అవసరమైన పూర్తి ఫర్నీచర్‌ను సమకూర్చారు.

● కళాశాలకు చెందిన 1993 బ్యాచ్ స్నేహితులు రూ.2 లక్షలతో కళాశాలలో బోరును, 2004 బ్యాచ్‌లో స్నేహితులుగా మారిన మరికొందరు రూ.4 లక్షలతో కళాశాలలోని ఈఎన్‌టీ విభాగానికి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. కళాశాల హితంకోరే స్నేహితులుగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.


రూ. 15 లక్షలతో రెండు గదుల నిర్మాణానికి చేయూతనిచ్చిన (1987, 1995 బ్యాచ్) స్నేహితుల బృందం


రూ.2 లక్షలతో 1993 బ్యాచ్ విద్యార్థులు కళాశాలలో బోరు వేయిస్తున్న దృశ్యం

దారి తప్పితే దండన తప్పదు

● నేర సమీక్షలో ఎస్పీ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేసేవారు దారితప్పి ప్రవర్తిస్తే దండన తప్పదని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలలతో పోలిస్తే గ్రేవ్ కేసులు, దొంగతనాలు కొంత తగ్గుముఖం పట్టాయని ఎస్పీ చెప్పారు. తీవ్ర నేరాల కేసుల(గ్రేవ్) ఛేదన సమయంలో ప్రణాళికాబద్ధంగా వెళితే సులువుగా ఫలితాలు రాబట్టవచ్చన్నారు. నెలాఖరులోగా పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పూర్తి స్థాయిలో విచారించాక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసుల విచారణకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఇళ్ల చోరీ కేసులు తగ్గుముఖం పట్టాయని, ఇటీవల దాదాపు 75 మంది పాత నేరస్థులను అరెస్టు చేశామని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వైట్ కాలర్, సైబర్ క్రైం నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీపీడీ, దారి డోపిడీ కేసుల పెండింగ్‌పై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంధ్య, కేదారినాథ్, జయశేఖర్, ప్రేమసాగర్, నిర్మల, కుమారి, శిరీష, అదనపు ఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో జాతీయ పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

వడమాలపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట ఉన్నత పాఠశాల క్రీడాకారులు వెండి పతకాలు సాధించారు.జూలై 26 నుంచి 30వ తేదీ వరకు జాతీయ గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చేతన్ సాయి(9వ తరగతి) 50 కిలోల విభాగంలో, ప్రణతి(8వ తరగతి) 34 కిలోల విభాగంలో ప్రతిభ చూపి వెండి పతకాలను సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాణం తీసిన ఈత సరదా


అక్షిత్(ఫైల్ ఫొటో)

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసిన ఘటన పట్టణంలోని అమ్మవారిపేట చెరువులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ఆరవ పాళెంకు చెందిన ఆరవ మధు, మోహనమ్మ కుమారుడు అక్షిత్(13) స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో భోజనం తర్వాత స్నేహితులతో కలిసి అమ్మవారిపేట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈతకొట్టే క్రమంలో విద్యార్థులు ప్రమాదంలో ఉండటంతో స్థానికంగా చేపలు పట్టేవారు గమనించి కాపాడారు. అక్షిత్ కనిపించకపోవడంతో స్కూల్‌కు వెళ్లిపోయి ఉంటాడని భావించి అందరూ మిన్నకుండిపోయారు. సాయంత్రమైనా ఆ బాలుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారించారు. అందరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చెరువు వద్ద పరిశీలించగా అక్షిత్ మృతదేహం తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీలు వేయకుండా సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడు

● అటెండర్ తిరుమలేష్ ఆరోపణ

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డ్యూటీలు వేయకుండా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడని ఆ కార్యాలయ అటెండర్ తిరుమలేష్ ఆరోపించారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కార్యాలయంలో తాను చేయాల్సిన పనులను ప్రైవేటు వ్యక్తుల చేత చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు రికార్డు రూమ్‌లోని బీరువా తెరిచి రికార్డులను పరిశీలిస్తుంటారని, డాక్యుమెంట్ నెంబర్లు రాస్తుంటారని తెలియజేశారు. తనకు తపాలా విధులు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల చేత ఎలా పనిచేయించారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిని వివరణ కోరగా విధుల్లో భాగంగా అప్పగించిన పనులను సిబ్బంది చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే సిబ్బంది కొరతతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన సెల్వరాజ్

వరదయ్యపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని పెద్దపాండూరు గ్రామానికి చెందిన సెల్వరాజ్ (22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు.శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నక్కలమిట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే స్థానికులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మృతుడు వరదయ్య

వడమాలపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాదిరేడు బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో మహిళ తీవ్ర గాయాలపాలైంది. పాదిరేడుకు చెందిన వరదయ్య(65) వడమాలపాట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు బైపాస్ రోడ్డు దాటు తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న లారీ ఢీకొంది. వరదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వసంతకు చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడింది. 108లో వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వరదయ్య మృతిచెందాడు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఐజీ గోపీనాథ్ జెట్టికి పితృవియోగం

ఓజిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డీఐజీ గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య (72) శుక్రవారం రాత్రి తిరుపతిలో మృతి చెందారు.ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఓజిలి మండలం కరబల్లవోలుకు శనివారం తీసుకువచ్చారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఓజిలి మండలం సగుటూరు ఎంపీటీసీగా పుల్లయ్య సేవలు అందించారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సందర్శించి నివాళులర్పించారు. కరబల్లవోలులోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుడు బళ్లారి రాఘవాచారికి డీఆర్వో నరసింహులు ఘన నివాళి అర్పించారు. రాఘవాచారి జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ రాఘవాచారి తెలుగు నాటక రంగానికి విశేష సేవలు అందించారని తెలిపారు.

ఘనంగా శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం

● హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి


విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న సతీష్‌రెడ్డి

సత్యవేడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీలో శనివారం 9వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జీ.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ.కార్తికేయన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల గవర్నింగ్ బోర్డు సభ్యులు, శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, సెనేట్ సభ్యులు హాజరయ్యారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ కోయంబత్తూరు టెక్స్‌టైల్స్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందన్నారు. ఇక్కడ విద్యా, పారిశ్రామిక వ్యవస్థ కలిసి అభివృద్ధి చెందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రయోజనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్తికేయన్ వార్షిక నివేదికను సమర్పించారు. విద్య, పరిశోధన, క్రీడా రంగాలలో సంస్థ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో 18 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా మరో ముగ్గురికి బంగారు పతకాలు అందించారు.

ఘనంగా ఎంబీయూ స్నాతకోత్సవం


శివమణికి గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ)లో శనివారం కాన్వకేషన్, గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు అధ్యక్షతన ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ అందరూ గొప్పవారు కాలేరని, కష్టపడేతత్వం కలిగిన వారే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనిన్నారు. ఎంబీయూ ఛాన్సలర్ మోహన్ బాబు మాట్లాడుతూ ప్రఫుల్ పటేల్ గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డా విద్యావేత్తగా, నేషనల్ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1698 మందికి గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, డ్రమ్స్ శివమణితో పాటు మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధినేత విజయ్ జవహర్ దార్ధాకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. దేశంలోనే ప్రముఖ వ్యక్తులకు డాక్టరేట్ ఇచ్చామని ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్ఏ రవిశేఖర్, సీజీఎస్ఐ వికాస్ సింగ్, డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

● అధికారులకు సీవీఎస్వో ఆదేశం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రానున్న బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయన విజిలెన్స్ ఫైర్, ఎస్పీఎఫ్ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సమావేశమయ్యారు. సీవీఎస్వో మాట్లాడుతూ.. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తిరుమలలోని ప్రతి ప్రాంతంపైనా నిఘా ఉంచుతూ భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు సీఎం పట్టువస్త్రాల సమర్పణ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రణాళికబద్ధంగా రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



కానిస్టేబుల్ పరీక్షలో.. వికసించిన పేదింటి కుసుమం


రిచా

కేవీబీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వారిది పేద కుటుంబం. తండ్రి లేడు. తల్లి కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను చదివించింది. గత ఏడాది కుమారుడు సూర్య ఆర్మీకి ఎంపికయ్యాడు. ఇప్పుడు కుమార్తె రిచా కానిస్టేబుల్‌గా ఎంపికైంది. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబరిచిన మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన మేరీ కుమార్తె రిచాను గ్రామస్తులు అభినందించారు. పట్టుదలతో అన్నాచెల్లెలు ఉద్యోగాలు సాధించారంటూ కొనియాడారు.

సెప్టెంబరు 25 వరకు ప్రత్యేక రైళ్ల కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు సెప్టెంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు(08547) విశాఖపట్నంలో ప్రతి బుధవారమూ బయలుదేరుతుందని, ఈ ప్రత్యేక రైలు(08548) తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

పుత్తూరు వార్తలు

తిరునాళ్ల వేళ వరుస చోరీలు
ఆందోళనలో పట్టణ ప్రజలు

పుత్తూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోలాహలంగా తిరునాళ్ల జరిగే వేళ వరుస దొంగతనాలు ప్రజలను ఆదోళనకు గురిచేస్తోంది. తిరుపతి -చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ పిజ్జా రెస్టారెంట్ పైన ఓ గదిలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రెండు సెల్‌ఫోన్లు, 20వేల నగదును దోచుకుపోయారు. ఈ చోరీ జరిగిన ఇంటికి పక్కనే ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లోని హార్డ్‌వేర్ షాపులో రూ.31 వేలను దుండగులు మూడురోజుల కిందట దోచుకు పోయారు. ఈ క్రమంలో ద్రౌపతిదేవి ధర్మరాజుల తిరునాళ్ల సోమవారం నుంచి జరగనుంది. చుట్టుపక్కల దాదాపు 20 వేలమంది పల్లె జనాలు తిరుణాళ్లకు రావడంతో రాత్రిళ్ల రోడ్లమీద జనసంచారం ఎక్కువగా ఉంటుంది. దీంతో సందిట్లో సడేమియాగా దొంగలు తమ చేతులకు పనిచెప్పే అవకాశం ఉంది. తిరుణాళ్ల ముగిసే వరకు పోలీసులు గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తుల విడిది నిర్మాణానికి రూ.50వేల విరాళం



పుత్తూరు,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మరాజుల ఆలయ నిర్వాహకులు నిర్మించ తలపెట్టిన గోవిందమాల భక్తుల విడిది గృహానికి న్యాయశాఖ విశ్రాంత ఉద్యోగి వెంకటరామయ్య రూ.50 వేలు విరాళం అందించారు. శని వారం సంబంధిత చెక్కును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు కోవిల్‌కార్ సాళ్వాకం కిష్టప్ప మొదలియార్, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పులి వాహనంపై ఊరేగిన ధర్మరాజుల స్వామి



పుత్తూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు వివిధ వేష, ధారణలలో ప్రజలను అలరించారు. సాయంత్రం పులి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయ దారులుగా గాండ్ల కుల సంఘం వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సాల్వాకం కృష్ణప్ప మొదలి, మాజీ ఛైర్మన్ యుగంధర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, కేశవ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లి పాల ప్రాముఖ్యత అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుత్తూరు టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని టాటా ట్రస్ట్ వారి విజయవాహినీ చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ బి.సంతోషి తెలిపారు. శనివారం పుత్తూరు మండల పరిధిలోని చౌటూరు అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, తల్లులకు తల్లిపాలు ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

హామీలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

వడమాలపేట,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చెప్పిన హామీలు నెరవేర్చడమే లక్ష్యం గా ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల క్లస్టర్ కన్వీనర్ పెద్దబ్బరాజు చెప్పారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కాయంపేట పంచాయతీలో ఇంటింటా కరపత్రాలు అంద జేశారు. నాయకులు హేమావతి, ఉమాపతి రావ్, చిట్టి, వెంకటేష్ యాదవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అప్పలాయ గుంటలోని ప్రసన్న వెంక టేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్స వం, ఊంజల సేవ వైభవంగా నిర్వ హించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అధికారి వేణుగోపాల్ రాజు, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పాలాభిషేకం



వడమాలపేట,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధుల విడుదల చేయడంపై రైతులు, టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎస్వీఆర్ పురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , నగిరి ఎమ్మెల్యే గాలి. భానుప్రకాష్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఉప సర్పంచ్ రవి, క్లస్టర్ ఇన్‌చార్జి పెద్దబ్బరాజు, నాయకులు సుకుమార్, నారాయణరాజు, చంద్రమోహన్‌రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీదేవి, హరిరాజు, యయాతి, మైనమ్మ సరస్వతి, మణిరాజు, భరత్, రైతులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి చంద్రబాబు

● ఎమ్మెల్యే భానుప్రకాష్



రైతులకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి వ్యవసాయ కార్యాలయ ఆవరణలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం పలుపథకాలను చంద్రబాబు ప్రవేశ పెట్టారని చెప్పారు. పొగాకు,మిర్చి రైతులను ఆదుకున్నారన్నారు. నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో 20,063 మంది రైతులు లబ్ది పొందారన్నారు. పీఎం కిసాన్ ద్వారా 16881 మంది రైతులకు రూ.337.89 లక్షలు, అన్నదాత సుఖీభవ కింద 20,063 మంది రైతులకు రూ.1003.6 లక్షల నగదు జమ అయినట్లు వివరించారు. వ్యవ సాయ సంచాలకులు కవిత, వ్యవసాయాధికారులు రామవేశ్వర్‌యాదవ్, రజనీకుమారి, తులసీరామ్, కోదండయ్య, విజయ్‌కుమార్, తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, పీఏసీఎస్ ఛైర్మన్లు బాలాజీ, వెంకటేశ్వరరావు, నాయకులు రమేష్‌బబాబు, రమేష్‌రాజు, మీరా, కృష్ణారెడ్డి, ఎం.వి.శ్రీనివాసులు, జ్యోతినాయుడు, సురేష్‌నాయుడు, జీవరత్నంనాయుడు, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

కోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి సమీపంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్

వాకాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్త ర్వులు జారీచేశారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహించిన రామయ్య సస్పెండ్ అవడంతో సయ్యద్ ఇక్బాల్‌ను నియమించారు.

గురుకులంలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించకుంటే చర్యలు తప్పవు

నాయుడుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె పర్యటించి అక్రమ కొళాయి కనెక్షన్లదారులతో మాట్లాడారు. డిపాజిట్‌తో పాటు మూడేళ్ల నీటి పన్ను చెల్లించి అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.





కారిజాత చెరువులో మట్టి తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు - రాత్రిపూట మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చెరువులనూ తవ్వేస్తున్నారు!

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- వైసీపీ హయాంలో చెలరేగిన అక్రమార్కులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా మారనితీరు
- యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చీకటి పడితే చాలు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం వచ్చినా తగ్గడం లేదు. ఇటీవల కారిజాత, కుదిరి, కోటపోలూరు చెరువుల్లో జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదంతా పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతందనే ఆరోపణలు ఉన్నాయి.సూళ్లూరుపేట మండలం కుదిరి, కోటపోలూరు చెరువులతో పాటు, తడ మండలం కారిజాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు పెరిగిపోయాయి. చీకటి పడితే కారిజాత చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా సూళ్లూరుపేట పట్టణంలోని కొత్త వెంచర్లు, ఇళ్ల ప్లాట్లకు తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు కారిజాత చెరువు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తీసుకుని దావాదిగుంట, షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం మీదుగా షార్ రోడ్డులో మట్టిని తరలిస్తున్న సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని తవ్వి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. చెరువులను కాపాడాల్సిన నీటి సంఘ అధ్యక్షుడు అక్రమార్కులతో చేతులు కలిపి మౌనంగా ఉండిపోతున్నారు. గత వారం రోజుల నుంచి కారిజాత చెరువులో పది అడుగుల మేర మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. మట్టి అక్రమ రవాణాపై గ్రామస్తులు పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కాళంగి నది నుంచి ఇసుక అక్రమ రవాణా నిషేధం ఉన్నా అక్రమార్కులు నిత్యం తవ్వి డంపింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతుల క్షేమమే ధ్యేయంగా పాలన: పాశిం



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల క్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాగణంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన చెక్కును రైతులకు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెర వేరుస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మొదటి విడతగా రూ.7వేల నగదును రైతుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. రెండో విడత అక్టోబరు, మూడో విడత నగదును జనవరిలో జమ చేయడం జరుగుతుందన్నారు. మొతంతం ఏడాదికి రైతులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను రూ.1000 పెంచి అందించడంతో పాటు తల్లికివందనం, దీపం పథకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ అమలు చేయడం జరిగింద న్నారు. ఈనెల 15నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సదుపాయాన్ని కల్పించనున్నామన్నారు. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని 22,217 మంది రైతులకు రూ.14.91 కోట్లు వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ అర్హులం దరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లుచెంచురామయ్య, మట్టం శ్రావణి, రవీంద్రరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, లీలావతి, వాటంబేడు శివకుమార్, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్, గోపినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం: విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఆర్డీవో కిరణ్మయి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఆర్డీవో కిరణ్మయితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు అందించే పెట్టుబడి సాయం తొలి విడత విడుదల చేసిన నగదు చెక్కులను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. అలాగే రైతులకు విత్తనాలు, సబ్సిడీతో మంజూరైన డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడం జరిగిందని, ఈనెల 15నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవోలు కాంచన, జ్యోతిర్మయి, గణేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, కామిరెడ్డి మురళీరెడ్డి, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, విజయమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం

నాయుడుపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట గాంధీమందిరం వద్ద శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, గూడూరు ప్రభావతమ్మ, నెలవల రాజేష్, శ్రీరామ్ ప్రసాద్, కట్టా వెంకటరమణారెడ్డి, అవధానం సుధీర్, మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, సుజాతమ్మ, మధుసూదనరెడ్డి, సంచి కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి, పొట్లపూడి రాజేష్, అంకయ్య పాల్గొన్నారు.

చిల్లకూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న సీపీఏస్ సిబ్బంది

చిల్లకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా చిల్లకూరు గ్రామానికి చెందిన కొండా రామచంద్రారెడ్డి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే పీఏసీఎస్ సభ్యులుగా ఏరూరు గ్రామానికి చెందిన దర్శి రమణయ్య, వడ్డికండ్రిగకు చెందిన ఇరగ వీరరాగయ్య నియమితులయ్యారు.పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్యనాయుడు, సిబ్బంది రామచంద్రారెడ్డి నివాసంలో ఆయనను కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

తిమ్మానాయుడుపాళెంలో సుపరిపాలనలో తొలిఅడుగు

కోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెం పంచాయతీలో శనివారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురికి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగభూషణం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను దోచుకుని, కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శివకుమార్, శశి కుమార్, బీవీ రమణయ్య, మణి, చంద్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా సీపీఐ జిల్లా మహాసభలు ఆదివారం నుంచి రెండో రోజుల పాటు జరగనున్నాయి. తొలిరోజు ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగే బహిరంగ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు పలువురు సీనియర్ నేతలు విచ్చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ నాయకులు చేస్తున్నారు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ యత్నం
నిందితుడిని పోలీసులకు పట్టించిన ప్రయాణికులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీకి పాల్పడ్డారు. ప్రయాణికులు ఒకరిని పట్టుకొని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

బాలాయపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీవో షంషద్ బేగం అన్నారు. మండలంలోని వెంగమాంబపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి ప్రసవం నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. అంతేకాకుండా డయాబెటిస్, క్యాన్సర్ ప్రమాదాలు తగ్గుతా యన్నారు. తల్లి పాలతో బిడ్డకు సరైన పోషణ అందడంతో పాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ వినూష, మహిళా పోలీస్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: మండలంలోని చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీవో మెహబూబి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠకరమైనవని అన్నారు. పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలు అందించడం ద్వారా బిడ్డలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శివజ్యోతి, ప్రసన్న, జ్యోతి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి, గురుకుల పాఠశాలలో తనిఖీలు



ప్రభుత్వాస్పత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి రోగులకు వైద్యం సక్రమంగా అందడం లేదని, బీసీ గురుకుల పాఠశాలలో వసతులు సరిగా లేవని ఫిర్యాదులు అందడంతో వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ న్యాయవాదులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. తొలుత ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన ఆయన వైద్యం సక్రమంగా అందుతోందా లేదా అని రోగులతో మాట్లాడి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా... మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వసతులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం న్యాయమూర్తి బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. మెనూను పరిశీలించారు. చాలినంత భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన వాటిని మరమ్మతులు చేసి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు వసతి గదులు సక్రమంగా లేవని తల్లిదండ్రులు చెప్పడంతో ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వసతులు మెరుగుపడేలా చూస్తామన్నారు. ఆయన వెంట న్యాయవాదులు రాజారాం, సుంకర రాజేష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టండి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. శనివారం చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఎంఈవో కృష్ణయ్య పాఠశాల విధివిధానాల మార్పులను తెలియజేశారు. ఉపాధి, వెలుగు, ఇరిగేషన్, ఐసీడీఎస్ అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరనివారు తహసీల్దారు కార్యాలయంలో సరి చేయించుకోవాలని డీటీ నిరంజన్ కుమార్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణయ్య, సుబ్బమ్మ, జట్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, హౌసింగ్ ఏఈ సుధీర్, కోట ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేద్దాం

కోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాలల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు మీజూరు మాధవ్, పాలా మల్లికార్జున్, పనబాక హేమంత్, కోటేశ్వరరావు, అశోక్‌కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

అవధాన బాలభాస్కరం పుస్తక పరిచయం



అవధానం బాల భాస్కరం పుస్తకావిష్కరణ

తిరుపతి(జీవకోన), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అవధాన ప్రక్రియలోని పలు రకాల విన్యాసాలకు నిలయం అవధాన బాల భాస్కరం పుస్తకమని శతవధాని, ప్రవచనకర్త ఉప్పలదడియం భరత్‌శర్మ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను దేశ, విదేశాల్లో 3 శతావధానాలు, 87 అష్టావధానాలు నిర్వహించానన్నారు. అందులో భాగంగా మొదటి 50 అష్టావధానాలను "అవధాన బాలభాస్కరం-2 పేరుతో పుస్తక రూపంలో తీసుకువచ్చానన్నారు. దీనిని గత నెలలో తన గురువు త్రిభాషా మహాసహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ వారణాసిలో ఆవిష్కరించారన్నారు. తిరుపతి ప్రజలకు ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తునామమన్నారు. అనంతరం అవధాన బాలభాస్కరం పుస్తకాన్ని ప్రదర్శించి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీసీసీ సభ్యురాలు కిడాంబి ప్రమీలమ్మ, శ్రీచక్ర ఆస్పత్రి, వుడ్‌సైడ్ హోటల్స్ అధినేత డాక్టర్ అర్చన, శతవాధాని ఆముదాల మురళి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సాదర వీడ్కోలు



కేంద్రమంత్రికి శ్రీకాళహస్తి కలంకారి చిత్రపటాన్ని ఇచ్చి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. శనివారం శ్రీవారి దర్శనం అనంతరం తిరుచానూరు, తిరుపతిలో పర్యటన ముగించుకొని మధ్యాహ్నం విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రికి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, తొట్టంబేడు రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గుమ్మడిపూడి దశరథాచారి అన్నారు. తొట్టంబేడు రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో శనివారం సీఎం అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు, నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ప్రేమ్‌కుమార్, జయచంద్ర, రాజేష్, బాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే తొలి అడుగు

ఏర్పేడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. పరమాలపల్లి, బండివానిపల్లి, వెంకటంపాళెంలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజునాయుడు, పొన్నారావు, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్‌నాయుడు, మహేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ధర్మరాజస్వామి ఉత్సవాలు

ఏర్పేడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో శనివారం ద్రౌపతీ దేవిసమేత ధర్మరాజుస్వామి ఉత్సవాలుఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఆగస్టు 15 వరకు జరగనున్నాయి. ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ నిర్వాహకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మంజుల

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా జగ్గరాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో స్త్రీ శిశుసంక్షేమశాఖ, న్యూట్రిషన్ మేనేజ్‌మెంట్ సంయుక్త ఆధ్వ ర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మి, అంగన్వాడీ టీచర్ బుజ్జమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి

రేణిగుంట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం వద్ద యువకుడిపై బీరు బాటిల్‌తో కొందరు దాడిచేశారు. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు...స్థానిక చెంచు వైన్స్ వద్దా శ్రీకాళహస్తి రోడ్డులో కాపురం ఉంటున్న సతీష్ మద్యం సేవిస్తుండగా మరో బ్యాచ్‌తో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఆటో తోలుతున్న ఓ వ్యక్తి అతడి స్నేహితులు కలిసి బీరు బాటిల్‌తో సతీష్ తలపై కొట్టారు. అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సతీష్‌ను కుటుంబసభ్యులు రుయాకి తరలించారని సమాచారం.

అదుపు తప్పిన ట్రాక్టరు ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలు



వరదయ్యపాళెం, ఆగస్టు2, (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వరదయ్యపాళెం మండలం సంతవేలూరు పంచాయతీ బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట మార్గంలో జరిగింది. సూళ్లూరుపేట నుంచి బీఎన్ కండ్రిగ వైపు వెళుతున్న ఓ ఇటుక ట్రాక్టరు కువ్వాకుల్లి పంచా యతీ లక్ష్మీపురం సమీపంలో అదుపుతప్పింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సూల్లూరు పేట మండలం పెరటి పాడుకు చెందిన ముగ్గురు కూలీలు ఇటుకల మధ్యలో ఇరుక్కుపోయారు. స్థానికులు వారిని రక్షించి 108లో సూళ్లూరుపేట ప్రభుత్వా స్పత్రికి తరలించారు.



గాయపడిన కూలీలను తొలుత ఆటోలో ఎక్కించిన దృశ్యం

రోడ్లు బాగుచేయాలని ఆటో డ్రైవర్ల నిరసన

రేణిగుంట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని ప్రధాన రోడ్లు బాగుచేయాలని ఆటో డ్రైవర్లు పంచాయతీ కార్యాలయం ముందు శనివారం నిరసన తెలియజేశారు. ఆటో యూనియన్ నాయకుడు రావణ, పలువురు డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'తొలిఅడుగు'

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి, పిల్లేటివారికండ్రిగ, ఆలత్తూరు, వీఎస్‌పురం పంచాయతీలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ప్రర్యటిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం రమణయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీనటుడు సుహాస్



శ్రీకాళహస్తి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వా మిని శనివారం సినీనటుడు సుహాస్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయ నను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అంద జేశారు.

విద్యతోనే ఉన్నతి



విద్యాసామగ్రి అందజేస్తున్న అమరావతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పిళ్లారి ఫౌండేషన్ అధ్యక్షురాలు అమరావతి అన్నారు. పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని ఎగువవీధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం విద్యాసామగ్రిని అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ రేఖ, సభ్యులు సుబ్రహ్మణ్యం, సంస్థ సభ్యులు హైమావతి, హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు అనురాధ,వర్మత, యశోద, శ్రీదేవి పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘననివాళులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శనివారం పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠ శాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం శ్రీదేవి, స్కౌట్ మాస్టర్లు ఎస్‌కే అజారుద్దీన్, వెంకటాద్రి, యోగానందం, మురళి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం





శ్రీకాళహస్తిలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు, ఏర్పేడులో నవధాన్యాలతో అభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టీడీపీ బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. అన్నదాత సుఖీభవ నిధుల విడుదల చేయడంతో రైతులతో కలిసి శనివారం టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథా చారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు పేట బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్, షేక్ మహబూబ్‌బాషా, కోట చంద్రశేఖర్, భాస్కర్, సయ్యద్ చాంద్‌బాషా, మురళీకృష్ణ, మురళీనాయుడు, వెంకటేశ్వర్లు, సులేమాన్, అయ్యప్ప, చలపతి, కార్తీక్, రంజిత్ పాల్గొన్నారు.

నవధాన్యాలతో చంద్రబాబుకు అభిషేకం

ఏర్పేడు: పల్లంపేటలో నవధాన్యాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభిషేకం నిర్వహించారు. ఉద్దులు, పెసలు, కందులు, రాగులు, సజ్జలు, వడ్లు తదితర ధాన్యాలతో అభిషేకం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రకటించిన మేరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కావడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అంటేనే రైతు ప్రభుత్వమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజునాయుడు, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. 9మంది మహిళలకు గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో 9మంది మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పల్లమాల గ్రామం దగ్గర చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సీసీఎల్ కంపెనీలో పని చేస్తున్న 9 మంది మహిళలు శనివారం ఉదయం డ్యూటీ ముగించుకుని శ్రీకాళ హస్తిలోని తమ ఇళ్లకు వెళుతుండగా మండలంలోని పల్లమాల గ్రామం దగ్గర ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న మెరిమి వనమ్మ, ప్రమీల, లత, మల్లేశ్వరి, పెంచలమ్మ, అంజలి, జ్యోతి, శోభ, వాలేటమ్మతో పాటు డ్రైవర్ రాజాకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన వారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

సత్యవేడులో పోటాపోటీగా 'అన్నదాత సుఖీభవ'

సత్యవేడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం, టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఒకే వేదికపై వేర్వేరుగా నిర్వహించడం చర్చనీయాంశమైంది. స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అరగంట తరువాత అదే కల్యాణ మండపంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శంకర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ చేసి, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పులి వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి



నవసంధి ఉత్సవంలో వీరభద్రస్వామి

నారాయణవనం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీకి అనుబంధగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం నవసంధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో సాగింది. పులి వాహనంపై గ్రామ వీధులలో ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



నారాయణవనం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తుల`కు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వరదయ్యపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం వరదయ్యపాళెంలో ఏఐటీయూసీకి అనుబంధంగా యూత్ ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హుస్సేన్, లక్ష్మయ్య, వెంకటయ్య, పోలయ్య పాల్గొన్నారు.

తొలి అడుగు బ్యానర్ల చింపివేతపై ఫిర్యాదు

నారాయణవనం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీ బ్యానర్ల చింపివేతపై మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి షణ్ముగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం నారాయణవనం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసినా తొలి అడగు కార్యక్రమం ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఉన్నారని వాటిని గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారని తెలియజేశారు. చింపివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చేతి బోరు నీరు కలుషితం



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి అరుంధ తీయవాడలో చేతి బోరు దగ్గర గేదెలను కట్టివేయడం వలన తాగునీరు కలు షితమ వుతోందని గ్రామస్తులు పేర్కొ న్నారు. అలాగే పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. తాగు నీరు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. అధి కారులు స్పందించి చేతి బోరు దగ్గర పారి శుధ్యం మెరుగుపరిచాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలతో మాతృ, శిశు మరణాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో మాతృ, శిశు మరణాలు సంభవిస్తాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్‌రెడ్డి తెలియజేశారు. శనివారం పల్లమాల ఉన్నత పాఠశాలలోని విద్యార్థునులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్‌రెడ్డి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామిత్వతో ఆర్థికాభివృద్ధి

నారాయణవనం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగా జారీచేస్తున్న స్వామిత్వ ఆస్తి కార్డులతో ఆర్థిక కార్యాకలపాల వేగం పుంజుకుంటుందని పాలమంగళం సర్పంచ్ ప్రేమలత, కార్యదర్శి ఆనంద్ పేర్కొన్నారు. శనివారం పాలమంగళంలో స్వామిత్వ కార్యక్రమం, పీ4, స్వర్ణ పంచాయితీ పోర్టల్‌పై అవగాహన కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ స్వామిత్వ కార్డులు పొందిన వారు త్వరగా రుణాలు పొందవచ్చన్నారు. స్వర్ణ పోర్టల్ ద్వారా పన్నులన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని గుర్తుచేశారు. డిప్యూటీ ఎంపీడీవో వీనయ్య పాల్గొన్నారు.

వేదోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం తైలాభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రధాని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ నిధుల విడుదలపై ప్రధానమంత్రి మోదీ ప్రసంగాన్ని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు తిలకించారు. శనివారం మండలంలోని చైతన్యపురం కేవీకేలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసులు, విశ్రాంత ఆత్మ ప్రాజెక్ట్ ఉపసంచాలకులు విజయచంద్ర నాయుడు, కేవీకే హెడ్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు పద్మజ, సుధాకర్, దివ్య, రాము కుమార్, అనూష, దివ్యసుధ, రైతులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్

కేవీబీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం తిరుపతికి చెందిన ఆడిట్ అధికారులు వీరేంద్ర, రాహుల్ 2024 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు జరిగిన లావాదేవీలపై, బ్యాంకు రుణాలపై, చెల్లింపులపై ఆడిట్ నిర్వహించారు. జిల్లా అధికారులకు నివేదికలు పంపిన తరువాత దానిని వివరిస్తారని ఏపీఎం ఇందిరా గాంధీ తెలిపారు.

మొక్కుబడిగా పిచ్చాటూరు మండల సమావేశం

- అధికారుల గైర్హాజరు
- అభివృద్ధిపై చర్చ లేనేలేదు

పిచ్చాటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై చర్చించాల్సిన మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఎంపీపీ రేఖ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ గైర్హాజరయ్యారు. అధికారుల స్థానంలో సిబ్బంది వచ్చారు. ప్రజా ప్రతినిధులకు బదులు కుటుంబసభ్యులు హాజరయ్యారు. తొలుత ఓ సర్పంచ్ మాట్లాడుతూ 2019కి ముందు గ్రామాల్లో చేసిన సిమెంటు రోడ్ల పెండింగ్ బిల్లులు ఇస్తారా, ఇవ్వరా అని పంచాయతీ రాజ్ ఇంజనీర్‌ని ప్రశ్నించారు. ఎంఈవో హేమమాలిని మాట్లాడుతూ వెంగళత్తూరు, అడవి కొడియంబేడు, బంగాళా గ్రామాలలోని సీఎస్ఐ పాఠశాలలను అనుమతులు లేకుండా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో హేమమాలిని

నిర్వహిస్తున్నారని తెలియజేశారు. వాటిలో చదివితే ప్రభుత్వ పథకాలు అందవని, వాటిలో ఇచ్చే స్టడీ సర్టిఫికెట్లు చెల్లవని వివరించారు. ఎంపీటీసీ రమేష్‌రాజు మాట్లాడుతూ భూ రీ సర్వే ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వెలుగు సీసీ నాగభూషణమ్మ మాట్లాడుతూ మహిళా రైతు మిత్ర గ్రూపుల సమావేశాలకు అదనపు భవనం మంజూరు చేయాలని కోరారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని సీడీపీవో సౌభాగ్య కోరారు. కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని బంగాళా సర్పంచ్ అమరావతి కుమారుడు అయ్యప్ప ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు విజయ, నాగభూషణమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో శివయ్య, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.